

సోమశిలలో 10.110 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 10.110 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 396 క్యూసెక్కుల వరద కొనసాగుతోందిగువకు 210 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,960
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,642
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,841
నవర (8 గ్రాములు)	రూ.54,728

గరిష్టం/కనిష్టం 38.1 /30.0

వాతావరణం

వాతావరణంలో తేమ 44 శాతం ఉంది. జిల్లాలో శనివారం వాతావరణం పొడిగా, వేడిగా ఉంటుంది. ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్పీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



గోడౌన్‌లోని ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను కలెక్టర్ ఎం.హరినారాయణన్ శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ఉపయోగించిన వీవీ ప్యాట్లలో మిగిలి ఉన్న పేపర్ రోల్స్‌ను తొలగించి, అనంతరం వీవీ ప్యాట్లను యథావిధిగా భద్రపరిచే ప్రక్రియను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఈ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మాదేవి, ఆర్డీఓ మలోల, రాజకీయ పార్టీల ప్రతినిధులు టీడీపీ నుంచి రసూల్, వైఎస్సార్‌సీపీ నుంచి విజయ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, ఆప్ నుంచి ధరణికుమార్, ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ సంస్థకు ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు అందుకుంటున్న సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్ షేక్

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థకు ప్రతిష్టాత్మకమైన 'ఎఫ్‌ఎం ఎగ్జాంప్లరీ గ్రీన్ బిల్డింగ్ ప్లాక్టీసెస్ అవార్డు– సిల్వర్ అవార్డు' లభించింది. ముంబయిలో గురువారం జరిగిన ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కాన్ఫరెన్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు–2024కు సంబంధించి 2వ ఎడిషన్ సందర్భంగా ఈ అవార్డును ప్రదానం చేశారు. సంస్థ తరఫున అడ్మిన్ సీనియర్ జనరల్ మేనేజర్ అల్తాఫ్ షేక్ ఈ అవార్డును అందుకున్నట్టు సంస్థ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. దేశంలో అతి పెద్ద ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్‌లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ సంస్థ ఈ అవార్డును సాధించినందుకు సీఈఓ రాఘవ్ త్రివేది సంతోషం వెలిబుచ్చారు. అంతర్గత విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు, పర్యావరణాన్ని పెంపొందించేందుకు మరింత కృషి చేస్తామని వెల్లడించారు.


ఉదయగిరి డిపోకు రూ.6.52 లక్షల రాబడి

ఉదయగిరి: దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయగిరి డిపో నుంచి నడిపిన ప్రత్యేక బస్సు సర్వీసుల ద్వారా రూ.6.52 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజరు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు డిపో నుంచి 24 ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. ప్రత్యేక సర్వీసులు నడిపినందుకు సహకరించిన సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): మూడేళ్ల బాలికపై లైంగికదాడి చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు రావూరు వీరయ్యకు (50) ఏడేళ్ల జైలు శిక్ష రూ.5 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు మహిళా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గూడూరు రూరల్ మండలం దివిపాళెం గ్రామ పంచాయతీ చవటపాళెం గ్రామానికి చెందిన నిందితుడు వీరయ్య స్థానికంగా ఉన్న ఫ్యాక్టరీలో పని చేసేవాడు. 2019 ఏప్రిల్ 6న మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న మూడేళ్ల బాలికకు మిఠాయిలు ఇస్తానని ఆశ చూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక అరిచి ఏడవడంతో పక్కింటి వారు వచ్చి కాపాడారు. బాలిక నానమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో వీరయ్యపై చార్జ్‌షీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ దువ్వూరు శైలజారెడ్డి కేసు వాదించారు.

అడ్మిషన్.. టెన్షన్



విద్యా సంవత్సరం ప్రారంభమైనా.. డిగ్రీ అడ్మిషన్లపై సందిగ్ధత నెలకొంది. ఇంటర్ ఫలితాలు వచ్చి 75 రోజులు దాటినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. నాలుగేళ్లుగా డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు. గతంలో జూన్ ప్రారంభంలోనే ఇందుకు సంబంధించి విధివిధానాలను రూపొందించి అడ్మిషన్లు నిర్వహించే ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఈ ఏడాది జూన్ దాటిపోతున్నా.. ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నెల్లూరు (టౌన్): డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నుంచి విధివిధానాలు వెలువడకపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు టెన్షన్ పడుతున్నారు. ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుంది.. ఎప్పుడు దరఖాస్తు చేసుకోవాలి.. ఎప్పుడు తరగతులు ప్రారంభం అవుతాయనే ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా నిర్వహించేది. అయితే ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో ఇంత వరకు ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారా? లేక ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారా అనే దానిపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోవడంతో విద్యార్థుల్లో అయోమయం నెలకొంది. డిగ్రీ కళాశాలల యాజమాన్యాల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమైతే విద్యార్థులు ఏదైనా ప్రత్యామ్నాయ కోర్సుల్లో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. అదే గతంలో జూన్‌లో అడ్మిషన్లు నిర్వహించి జూలై తొలి వారం నుంచి తరగతులు నిర్వహించారు.

జిల్లాలో 67 డిగ్రీ కళాశాలలు

జిల్లాలో మొత్తం 67 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ప్రభుత్వ 9, ఎయిడెడ్ 3, ప్రైవేట్ 55 డిగ్రీ కళాశాలల ఉన్నాయి. ఈ కళాశాలల్లో 30,244 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతేడాది ప్రథమ సంవత్సరంలో 9,136 మంది చేరారు. ద్వితీయ సంవత్సరంలో 8,371 మంది, తృతీయ సంవత్సరంలో 12,737 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2020–21 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ ద్వారా అన్ని కళాశాలల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో కళాశాలను బట్టి 7 ప్రోగ్రాంల నుంచి 19 ప్రోగ్రాంలు ఉన్నాయి. అనుకూలంగా ఉన్న ప్రోగ్రాంలను ఎంచుకుని విద్యార్థులు ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారు.

ఆన్‌లైనా.. ఆఫ్‌లైనా..

గత నాలుగేళ్లుగా డిగ్రీ అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. విద్యార్థి కళాశాలకు రాకుండానే ఇంటి దగ్గర నుంచి మంచి కళాశాలను ఎంచుకుని అడ్మిషన్ చేసుకుంటున్న పరిస్థితి ఉంది. గతంలో ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్న సమయంలో పట్టణాల్లో ఉండే కళాశాలల్లో సీట్లు మిగిలేవి కావు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉండే కళాశాలల్లో విద్యార్థులు అంతంత మాత్రంగానే చేరేవారు. ఈ ప్రక్రియతో గ్రామీణ కళాశాలలు డోలాయమానంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ క్రమంలో గత ప్రభుత్వం ఆన్‌లైన్ అడ్మిషన్ల ద్వారా ప్రతిభ, రిజర్వేషన్ల వారీగా ఆయా కళాశాలల్లో విద్యార్థులకు సీట్లు కేటాయిస్తోంది. గత ప్రభుత్వం విద్యాదీవెన పేరుతో కళాశాలలో ఎంత ఫీజు ఉంటే అంత ఫీజును చెల్లించింది. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన పార్టీకి అనకూలంగా ఉన్న కొన్ని విద్యా సంస్థలు ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేసి ఆఫ్‌లైన్ అడ్మిషన్లు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అడ్మిషన్ల నోటిఫికేషన్ ఆలస్యమవుతుందని చెబుతున్నారు.

ఇంటర్ ఫలితాలు వచ్చి రెండున్నర నెలలు దాటినా..



నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలు ఏప్రిల్ 12వ తేదీన విడుదల చేశారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ద్వితయ సంవత్సరానికి సంబంధించి ఈ నెల 18న, ప్రథమ సంవత్సర ఫలితాలు ఈ నెల 24న ఇంటర్‌బోర్డు విడుదల చేసింది. సాధారణంగా ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేసిన వెంటనే డిగ్రీ అడ్మిషన్లకు సంబంధించి హయ్యర్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి నోటిఫికేషన్ విడుదల కాలేదు. అడ్మిషన్లకు సంబంధించి నోటిఫికేషన్ కూడా ఎప్పుడు విడుదల చేస్తారోనన్న దానిపై అధికారులకు కూడా స్పష్టత లేదు. దీంతో డిగ్రీ అడ్మిషన్లపై అటు విద్యార్థులతో పాటు ఇటు కళాశాలల యాజమాన్యాల్లో కూడా ఆందోళన నెలకొంది.

ఆందోళనలో యాజమాన్యాలు

డిగ్రీ కళాశాలలకు సంబంధించి అడ్మిషన్లపై ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నోటిఫికేషన్ విడుదల కాకపోవడంపై ఆయా డిగ్రీ కళాశాలల యాజమాన్యాల్లో ఆందోళన నెలకొంది. అడ్మిషన్లు ఆలస్యమైతే విద్యార్థులు ఏదైనా ప్రత్యామ్నాయ కోర్సు తీసుకునే అవకాశం ఉందంటున్నారు. అడ్మిషన్లు ఆలస్యమైతే తరగతులు, పరీక్షలు కూడా ఆలస్యమవుతుందని చెబుతున్నారు. సాధారణంగా డిగ్రీలో 90 రోజుల పని దినాలకు ఒక సెమిస్టర్ నిర్వహించాల్సి ఉంది. ఈ లెక్కన అడ్మిషన్లు ఆలస్యమైతే సెలవుల్లోనూ తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో అటు విద్యార్థులతో పాటు యాజమాన్యాలు కూడా ఇబ్బంది పడే పరిస్థితి అనివార్యమవుతోంది.

ఇంకా నోటిఫికేషన్ రాలేదు

డిగ్రీ అడ్మిషన్లపై ఇప్పటి వరకు ఎలాంటి నోటిఫికేషన్ రాలేదు. త్వరలో నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. నోటిఫికేషన్‌లో విధి, విధానాలను ప్రకటిస్తారు. అందుకణుగుణంగా డిగ్రీలో అడ్మిషన్లు నిర్వహిస్తాం. నోటిఫికేషన్‌లో గైడ్‌లైన్స్ ఆధారంగా విద్యార్థులకు ఆయా కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు.

– హుస్సేనయ్య, కాలేజీ డెవలప్‌మెంట్ డీన్, యూనివర్సిటీ

డీసీసీబీ, డీసీఎమ్మెస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ





జేసీ మాధవన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, డీసీఎమ్మెస్ బీఎం వెంకటస్వామి

నెల్లూరు (వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్మెస్) లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ సేతు మాధవన్‌ను ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్‌గా వున్న వీరి చలపతిరావు తమ పదవులకు రాజీనామా చేసిన విషయం విదితమే. పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన సేతు మాధవన్‌ను ఆయన చాంబర్‌లో డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ప్రజా సంఘాలపై ధర్నా కేసు కొట్టివేత

కందుకూరు: ఏడేళ్ల క్రితం సీపీఎం, ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల నాయకులపై నమోదైన కేసును కొట్టివేస్తే శుక్రవారం కందుకూరు ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తి పూర్ణిమాదేవి తీర్పు వెలువరించారు. పోకూరు గ్రామానికి చెందిన దాదాపు 10 మంది క్రైస్తవులు ఓగూరు వద్ద చర్చిలో ప్రార్థనలకు ఆటోలో వెళ్లి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అత్యాల సువార్తమ్మ, ఎండ్లూరి ఇమ్మానియేలు అనే ఇద్దరు మృతి చెందగా, మిగిలిన వారికి గాయాలయ్యాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ మృతదేహాలతో స్థానిక ఏరియా హాస్పిటల్ వద్ద ఎమ్మార్పీఎస్, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. దీంతో వీరిపై కందుకూరు పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌ల్లో పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. అయితే నిందితులపై మోపిన నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు సూరపోగు శ్యామ్‌మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు జలదంకి నరశింగరావు మాదిగ, పెరిగే లక్ష్మణ్‌మాదిగ, ఉప్పులూరి సుబ్బారావు, సీపీఎం నాయకులు జీవీబీ కుమార్, మిట్టనోసల సుభాన్‌కు కేసు నుంచి విముక్తి లభించింది. నిందితుల తరఫున న్యాయవాదులు గొడపేరు కోటేశ్వరరావు, కత్తి విజయప్రభ వాదించారు.

ప్రహరీ ధ్వంసం చేయడం పిరికి పంద చర్య

కోవూరు: టీడీపీ నేత జక్కంరెడ్డి భాస్కర్‌రెడ్డి తన స్థలానికి సంబంధించిన ప్రహరీ ధ్వంసం చేయడం పిరికి పంద చర్య అని కోవూరు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానికంగా తన అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయంగా తనపై భాస్కర్‌రెడ్డి కక్ష పూరితంగా వ్యవహరించారన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో తన స్థలానికి నిర్మించిన ప్రహరీ ధ్వంసం చేశాడని ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తన స్థలంలో ఆయన స్థలం ఉందంటూ దౌర్జన్యం చేస్తున్న భాస్కర్‌రెడ్డి టీడీపీ అధికారంలోకి రావడంతో ఇలాంటి దుశ్చర్యకు పాల్పడ్డాడని మండిపడ్డారు. స్థలానికి సంబంధించి రిజిస్టర్ డాక్యుమెంట్లు తన వద్దనే ఉన్నాయని, పోలీసులు ఈ కేసును న్యాయబద్ధంగా వ్యవహరించి భాస్కరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పిన్నెల్లితో కాకాణి, పర్వతరెడ్డి ములాఖత్

వెంకటాచలం: చెముడుగుంటలోని జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ములాఖత్ అయ్యారు. ప్రతిపక్షంపై రాజకీయంగా జరుగుతున్న అణచివేత ధోరణిపై మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జైలు బయట కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని, కేసులకు, జైళ్లకు భయపడేవాళ్లం కాదనే విషయం తెలుసుకోవాలన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై పలు సెక్షన్లతో అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడం హేయమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న దాడులు, విధ్వంసాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. పార్టీ నాయకులపై, కార్యకర్తలపై జరిగే దాడులను, అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని పోరాటాలకు సిద్ధపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తామన్నారు. జైల్లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో మాజీ మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ కూడా శుక్రవారం ములాఖత్ అయ్యారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీ యామిని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. కక్షిదారులు తమ కేసులను ఖర్చు, కాలయాపన లేకుండా పరిష్కరించుకోవాలని కోరారు. ఈ విధానంతో ఇరుపక్షాలకు మేలు జరుగుతుందన్నారు.

జిల్లా క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నీ ప్రారంభం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని నెల్లూరు క్లబ్‌లో ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు డిస్ట్రిక్ట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 'జిల్లా క్యారమ్స్ ర్యాంకింగ్ టోర్నమెంట్ 2024' ను ఏపీ ట్రాన్స్‌కో మాజీ డైరెక్టర్ జె.వెంకటేశ్వరరావు, రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాకుల సుబ్బారావు, నెల్లూరు క్లబ్ అధ్యక్షుడు పి.సుధాకర్‌రెడ్డి, మారంరెడ్డి మహేష్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా క్యారమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో క్యారమ్స్ క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, క్యారమ్స్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తానన్నారు. జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి వీఆర్ శ్రీధర్ మాట్లాడుతూ టోర్నీలో ర్యాంక్ సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లోనే పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలి

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



పోర్టు సీఈఓ జీజేరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టులో కంటైనర్ టెర్మినల్‌ను పునరుద్ధరించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పోర్టుకు వచ్చిన సోమిరెడ్డి గంటకుపైగా సీఈఓ జీజేరావుతో సమావేశమయ్యారు. కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరించే నిమిత్తం అవసరమైతే అదానీతో కూడా చర్చిస్తామన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పోర్టులోని కంటైనర్ల ద్వారా గతంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు జరిగాయన్నారు. కంటైనర్ టెర్మినల్ మూసివేయడంతో కేవలం బొగ్గు దుమ్ము పోర్టుగా మిగిలిపోయిందన్నారు. సుమారు 12,000 మంది ఉపాధి కోల్పోయారన్నారు. సీవీరావు ఆధ్వర్యంలో 2019కి ముందు ఏడాదికి 10 లక్షల కంటైనర్ల ఎగుమతి, దిగుమతులు జరిగాయన్నారు. అదాని యజమాని అయిన తర్వాత కంటైనర్ టెర్మినల్ మూతపడడం ఆందోళన కలిగించిందన్నారు.

చైతన్య స్కూల్స్ షిఫ్టింగ్ అనుమతులు రద్దు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న రెండు శ్రీచైతన్య స్కూల్స్ షిఫ్టింగ్ అనుమతులను హైకోర్టు రద్దు చేసినట్లు అపస్మా జిల్లా నాయకులు తెలిపారు. శుక్రవారం మినీబైపాస్‌లోని శ్రీనేతాజీ స్కూల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ముత్తుకూరురోడ్డు పార్థసారథినగర్, దర్గామిట్ట సరస్వతీనగర్‌లో ప్రారంభించనున్న శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్స్ షిఫ్టింగ్ అనుమతులపై హైకోర్టును ఆశ్రయించామన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను దృష్టిలో ఉంచుకుని డీఈఓ వెంటనే మూసివేయాలన్నారు. ఈ సమావేశంలో అపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి వెంకటరామయ్య, ట్రెజరర్ కృష్ణారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణారెడ్డి, నగర అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘ నిధులు ఖర్చు చేయండి

- ప్రజల అవసరాలు గుర్తించి పనులు పూర్తి చేయాలి
- ఆడిట్ అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి
- జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు

నెల్లూరు (పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న 15వ ఆర్థిక సంఘ నిధులను ఖర్చు చేయాలని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ మండలాల ఏఓలతో సీఈఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి ఉన్నతాధికారులంటే గౌరవం లేదన్నారు. మనసు పెట్టి పని చేయడం లేదన్నారు. జిల్లా కార్యాలయానికి పంపించే సమాచారాన్ని పూర్తిగా పరిశీలిస్తున్నారా? అని ప్రశ్నించారు. సకాలంలో సమాచారం ఇవ్వకుండా చివరి క్షణంలో పాత వివరాలు పంపిస్తే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. అధిక శాతం మండలాల్లో నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని ఖర్చు చేయడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి అనుమతులు తీసుకుని త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ ఎంపీడీఓ కార్యాలయాలకు సంబంధించి ప్రతి నెల నిధులు, ఖర్చులు, ఇతర వివరాలు తప్పని సరిగా పంపించాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దని సకాలంలో వివరాలు అందజేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆడిట్‌కు సంబంధించి 13,730 అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవి గతంలో పనిచేసిన అధికారులవి మాకు సంబంధం లేదంటే సరిపోదన్నారు. ప్రస్తుతం ఎవరు పని చేస్తున్నారో వారు బాధ్యత తీసువాల్సి ఉందన్నారు. పాత ఆడిట్ అభ్యంతరాలను పరిశీలించి దానికి అవసరమైన ఎంబుక్స్, బిల్స్ సిద్ధం చేసి ఆడిట్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. నిధుల ఖర్చు చేయడం, ఆడిట్‌లో అభ్యంతరాలను ఏఓలు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ కార్యాలయ అధికారులు, వివిధ మండలాల ఏఓలు పాల్గొన్నారు.

మమ్మల్ని ఆపేది ఎవరంటూ..





వాహనానికి నంబర్ ప్లేట్ ఎంతో ముఖ్యమైంది. ముందు, వెనుక వైపులా నంబర్ స్పష్టంగా కనపడేలా హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. అయితే కొందరు నిబంధనలకు నీళ్లొదిలి అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మమ్మల్ని ఆపేది ఎవరనే చందాన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మేము ఫలానా ఎమ్మెల్యే తాలూకా అంటూ పెద్ద అక్షరాలను, నేతల ఫొటోలను నంబర్ ప్లేట్లపై వేయించుకుని యథేచ్ఛగా తిరుగుతున్నారు. రూల్స్ పాటించకపోతే కఠినంగా వ్యవహరిస్తామని అనేకసార్లు చెప్పిన ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు వీరి విషయంలో మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. అధికార పార్టీ వారు కావడంతో వెనుకడుగు వేస్తున్నట్లు ప్రచారం ఉంది.

– నెల్లూరు(క్రైమ్)

ఎన్నికల హామీలపై దృష్టి సారించండి

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే విషయంపై అధికార టీడీపీ దృష్టి పెట్టాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు అధికారం దక్కిన వెంటనే అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనబెట్టి విధ్వంసకర పాలన సాగిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆస్తులు ధ్వంసం చేయడం, వారిపై దాడులు చేయడాన్ని ఆయన ప్రోత్సహిస్తున్నారన్నారు. తమ పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసేలా దాడులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకుల ఉడత బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దాడులకు స్వస్తి పలకాలన్నారు. రాష్ట్రంలో అన్ని పార్టీలు ఏకమైనా వైఎస్సార్‌సీపీకి 40 శాతం ఓట్లు వేసి ప్రజలు మద్దతుగా నిలిచారన్నారు. ప్రజల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా కోరుతున్నారని తెలియజేశారు. ప్రతిపక్షం ఉంటేనే సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. తమ ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టామన్నారు. గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని, ఎవరైతే ధ్వంసం చేశారో వారిచేతే తిరిగి కట్టించే రోజులు భవిష్యత్‌లో వస్తాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు పెదమల్లు రమణారెడ్డి, కోనం చిన బ్రహ్మయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు రావుల దశరథరామయ్యగౌడ్, జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

సోమశిల ప్రాజెక్ట్ పరిశీలన



సోమశిల: అనంతసాగరం మండలంలోని సోమశిల ప్రాజెక్ట్‌ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలకు ఆప్రాన్ దెబ్బతిందన్నారు. జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు, నెల్లూరు చెన్నై, చిత్తూరు జిల్లాలకు తాగునీటిని అందించే ఈ జలాశయానికి మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సోమశిల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట దామా వెంకయ్య, హనుమారెడ్డి, జిల్లా కార్యదర్శులు గంగపట్నం రమణయ్య, షేక్ షాన్‌వాజ్ తదితరలున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి రాగి వైరు చోరీ

ఆత్మకూరు: పొలాల్లో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు పగులగొట్టి అందులోని రాగి వైరును చోరీ చేసిన ఘటన మండలంలోని రామస్వామిపల్లిలో జరిగింది. ఎస్సై కె.ముత్యాలరావు కథనం మేరకు.. శుక్రవారం పొలాల వద్దకు వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టినట్లు గుర్తించి విద్యుత్ శాఖ రూరల్ ఏఈ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. చోరీ చేసిన వైరు విలువ సుమారు రూ.10 వేలకుపైగా ఉంటుందని రైతులు తెలిపారు. దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టడంతో మెట్ట పంటలకు సాగునీటి సమస్యలు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 132	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ (లైవ్)	: 120	లేయర్ చికెన్	: 204
బ్రాయిలర్ చికెన్	: 238		

మేనత్త అంత్యక్రియలకు వచ్చి..

• నీళ్ల ట్యాంక్ పైనుంచి జారిపడి యువకుడి మృతి

ఆత్మకూరు: వృద్ధురాలి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన ఓ యువకుడు నీళ్ల ట్యాంక్ పైనుంచి జారిపడి మృతిచెందిన ఘటన ఆత్మకూరు పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్సై కె.ముత్యాలరావు కథనం మేరకు.. పట్టణానికి చెందిన ముంతాజ్ (70) అనే వృద్ధురాలు అనారోగ్యానికి గురైంది. ఆమె స్థానిక సుల్తాన్ షహీద్ దర్గాలో కొంతకాలంగా ఉంటోంది. ఈక్రమంలో గురువారం అర్ధరాత్రి చనిపోయింది. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు శుక్రవారం దర్గా వద్దకు చేరుకున్నారు. ఆచారం ప్రకారం ఆమెకు స్నానం చేయించేందుకు ఉపక్రమించారు. అయితే అక్కడున్న వాటర్ ట్యాంక్ నుంచి నీరు సక్రమంగా రాలేదు. దీంతో మృతురాలికి మేనల్లుడయ్యే సయ్యద్ ముజీబ్ (29) పరిశీలించేందుకు సుమారు 20 అడుగుల ఎత్తులో ఉన్న ట్యాంక్‌పైకి ఎక్కాడు. సరిచేసి దిగుతుండగా కాలు జారి కింద పడ్డాడు. దీంతో తలకు గాయమైంది. వెంటనే ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ముజీబ్ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.